క్లుప్తంగా

పీజీ ఎంట్రెన్స్‌లో జిల్లా విద్యార్థి ప్రతిభ


నైతలం లింబాజీ

ఆదిలాబాద్‌టౌన్: గుడిహత్నూర్ మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన నైతం లింబాజీ పీజీ ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాడు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో 70 మార్కులు సాధించి 3వ ర్యాంక్ పొందాడు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల డిగ్రీ పూర్తి చేశాడు. మంచి ర్యాంక్ రావడం పట్ల కుటుంబీకులు, లెక్చరర్లు అభినందనలు తెలిపారు.

రేపు ఆధ్యాత్మిక ప్రవచనం

ఇచ్చోడ: ఈనెల 17న ఆషాడ ఏకాదశి సందర్భంగా వైష్ణవ సదన్ పీఠాధిపతినారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో రాత్రి 8 నుంచి 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముందస్తు అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగులు సోమవారం రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తును ఆదిలాబాద్ రూరల్ పోలీసులు మండలంలోని చాందా (టి) గ్రామంలో ఆయన నివాసం వద్ద ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి

సిరికొండ: ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని ముదిరాజ్ కులస్తులు తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు నిధులు కేటాయించాలని కోరారు. చెరువులు, కుంటలపై పూర్తిగా ముదిరాజ్‌లకు హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ కులస్తులు ఓరగంటి పెంటన్న, బోయిన్‌వాడ్ అమోల్, ఎగ్గిడి మాల్లారెడ్డి, ఓరగంటి నర్సిహులు, సుధాకర్, ఆశన్న, ఇస్తారి, తులసిదాస్, పరుశురాం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాంసి: మండల కేంద్రానికి చెందిన కోట్రంగి గోదావరి అనారోగ్యంతో బాధపడుతోంది. కూలీ కుటుంబానికి చెందిన గోదావరికి వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం గ్రామమాలీ సంఘం తరఫున రూ.6300 ఆర్థికసాయం అందజేశారు. బాధితురాలి ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. సంఘం సభ్యులు గంగారం, ఆశన్న, సాయి, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బందికి సన్మానం

బోథ్: సొనాల గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆరు సంవత్సరాలుగా క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న శివ, అకౌంటెంట్ కమల్‌ను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆరు సంవత్సరాలుగా గ్రామస్తులకు, రైతులకు, వ్యాపారస్తులకు సేవలందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహర్ సంఘం జిల్లా అధ్యక్షులు కాంబ్లే భీంరావ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, సుభాష్ సూర్య, మురళీ, బాశెట్టి రమేశ్, కసిరె పోతన్న, మహేందర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక

బోథ్: సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీకి విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తం 29 ఎన్‌సీసీ సీట్లు ఉండగా.. 13 మంది బాలికలను, 16 మంది బాలురను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో పాఠశాల అసోసియేటెడ్ ఎన్‌సీసీ అధికారి అన్వర్ అలీ, పర్యవేక్షకులు ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముఖ్ సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఖమర్ అహ్మద్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ జవాన్లు, చెత్త సేకరించే ట్రాక్టర్ల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: జైనథ్ మండలంలోని కొరట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం స్థానిక ప్రజాసేవభవన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సరుకుల వివరాలు


నేరడిగొండ కేజీబీవీలో సరుకుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రత్యేకాధికారి

- కేజీబీవీల్లో అమలు
- అక్రమాలకు చెక్ పెట్టనున్న ప్రభుత్వం

నేరడిగొండ: వసతిగృహాల్లో ఉండే సరుకులు పక్కదారి పట్టకుండా మరింత సమర్థవంతంగా నిర్వహణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే అధికారులు హాస్టల్ మేనేజ్మెంట్ ఆన్‌లైన్ సిస్టమ్ రూపకల్పన చేశారు. ఈవిద్యా సంత్సరం నుంచే కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో కేజీబీవీలు 18 ఉన్నాయి. వీటిలో 4,936 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలకు నిత్యావసర సరకులు, కూరగాయలు, తదితర సామగ్రి సరఫరాకు జిల్లా స్థాయిలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి అందిస్తున్నారు. ప్రతిరోజూ వచ్చిన సరకుల ప్రారంభ నిల్వ, వినియోగించాక ముగింపు నిల్వలను రికార్డుల్లో రాస్తున్నారు. విద్యాలయాల్లో అకౌంటెంట్లు ఈ విధులను నిర్వహిస్తున్నారు.

పక్కాగా పర్యవేక్షణ..
మండల, జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించినప్పుడు సరుకుల కొరత నిల్వల్లో తేడాలు గుర్తిస్తున్నారు. నిబంధనల మేరకు చికెన్, పాలు, గుడ్లు సరఫరా చేయకుండా టెండర్‌దారులతో కుమ్మక్కై పక్కదారి పట్టించడం లాంటి అక్రమాలు గతంలో వెలుగు చూశాయి. కొన్నిసార్లు సరుకుల వివరాల నమోదు చేయలేని సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టి వాటి ఉపయోగాన్ని, నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు తీసుకొచ్చిన ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా ప్రతీరోజు సమగ్ర వివరాలు నమోదు చేయనున్నారు.

నమోదు చేయాల్సినవి..
విద్యార్థుల సంఖ్య, క్రితం రోజు ముగింపు నిల్వ ఆరోజు ప్రారంభ నిల్వగా పేర్కొంటూ ఏ రోజుకా రోజు కాంట్రాక్టర్ అందించిన సరకుల వివరాలు ఎంతమేర వంటలకు వినియోగించారు. రాత్రి భోజనం తర్వాత ఎంతమేర నిల్వ ఉందో నమోదు చేయాలి. గత నెలలో కస్తూరిబా పాఠశాలల్లో ట్రయల్ రన్ చేసి ఈనెల నుంచి అమలు చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ సకాలంలో సరకులు తెస్తున్నారా? లేదా? అనేది ఉన్నతాధికారులు నిత్యం గమనించే అవకాశం ఉంటుంది. రోజువారీ నిర్వహణలో నగదు చెల్లించాల్సి వస్తే ఆ వివరాలు కూడా నమోదు చేసేలా వీలు కల్పించారు. ప్రస్తుతం కేవలం కస్తూరి బా పాఠశాలల్లో మాత్రమే ఈవిధానాన్ని అమలు చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కస్తూరిబా పాఠశాలల్లో హాస్టల్ మేనేజ్‌మెంట్ ఆన్‌లైన్ సిస్టమ్ అమలు చేస్తున్నాం. ప్రతీరోజు ప్రత్యేకాధికారులు అన్ని వివరాలు పొందుపర్చేలా చర్యలు చేపట్టాం.
– ఉదయశ్రీ, జీసీడీవో

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సిరికొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ద్వారా నిరుపేద ఆడపిల్ల తల్లిదండ్రులకు వరలా మారిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఓరగంటి పెంటన్న, బియ్యల మల్లేష్, సూర్యకాంత్, కృష్ణరెడ్డి, రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ
సిరికొండ: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న తండ్రి రాజన్న గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించినందున మాజీ ఉప సర్పంచ్ కుటుంబాన్ని, పంచాయతీ కార్మికుడు దాసరి శ్రీనివాస్ భార్య దాసరి రజిత మరణించిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

నేడు చెక్కుల పంపిణీ
బోథ్: నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో మంగళవారం ఉదయం 11:00 గంటలకు బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు మండల బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నేరడిగొండ: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. జీవో నం.10 రద్దు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచేలా చూడాలన్నారు. అలాగే వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో జారీ అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు.

వేధిస్తే సమాచారం ఇవ్వాలి


అవగాహన కల్పిస్తున్న లావణ్య

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు, యువతులను ఎవరైనా వేధిస్తే సమాచారం ఇవ్వాలని సఖీ కేంద్రం కౌన్సిలర్ లావణ్య అన్నారు. జన శిక్షణ సంస్థ ద్వారా బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటున్న మహిళలు, యువతులు, కేవీకేలో వ్యవసాయ కూలీలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఖీ కేంద్రం ద్వారా ఐదు రకాల సేవలను అందిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలు, బాలికల చట్టాలు, గృహ హింసా, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్‌క్రైమ్ తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కౌన్సిలర్ ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ మాట అంగన్‌వాడీ' బాట ప్రారంభం


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధ మాట్లాడుతూ మహిళ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఈనెల 20వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 18న ఇంటింటికీ వెళ్లి రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను గుర్తిస్తామని, 19న స్వచ్ఛ అంగన్‌వాడీ కార్యక్రమం, 20న సామూహిక అక్షరాభ్యాసం, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం తులసీ, మమత, ఆశ కార్యకర్తలు రజున, స్వప్న, ఆర్పీలు ఫరీద పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఆయా గ్రామాల నుంచి చదువుకోవడానికి వచ్చి పస్తులుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పి పదేళ్ల అధికారంలో ఉండి అమలు చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మున్న, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభ విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు సిడాం శంభు వర్ధంతి ఈనెల 20న ఉట్నూర్ మండలంలోని మత్తడి శంభుగూడ గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం కోరారు. సోమవారం మండల కేంద్రంలో సిడాం శంభు వర్ధంతి కరపత్రాలు ఆవిష్కరించారు. సిడాం శంభు ఆదివాసీ హక్కులు, న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారానికి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, సిడాం సోనేరావ్, దుర్వ మనోహర్, రాథోడ్ భీంరావ్, హనుమాన్, గోవింద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

తలమడుగు: సైబర్‌నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి సుశీల అన్నారు. సోమవారం మండలంలోని బరంపూర్ గ్రామంలోని జెడ్పీ ఎస్‌ఎస్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఫోన్‌లో ఏమైనా మెసేజ్‌లుగాని కొత్త యాప్‌లు వస్తే డౌన్లోడ్ చేయకూడదని సూచించారు. అమ్మాయిలను పోకిరీలు వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు మహేందర్ యాదవ్, అమరేందర్, షీటీం సిబ్బంది సత్యమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తలమడుగు: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులను పరిశీలించారు. తక్షణమే మరమ్మతులు చేయించాలని ఎంఈవో నారాయణను ఆదేశించారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు గజానన్, రామ్ రెడ్డి, సుకుమార్ పేట్కులే, శ్రీనివాస్ రెడ్డి, సుజాత, రాజేందర్ ఉన్నారు.

ఘనంగా మొహర్రం ఉత్సవాలు


మొహర్రం ఉత్సవాలు జరుపుకుంటున్న భక్తులు


పీరీలు, డోలలతో నృత్యం చేస్తున్న యువకులు


పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామ శివారులోని షాదుల్లా బాబా దర్గాలో మొహర్రం ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అంకోలి గ్రామంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా భక్తులు పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు మంగారపు మల్లేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వడగామ్, వాల్గొండ, హర్కపూర్, భగత్‌సింగ్ నగర్, ముత్నూర్, దనోరా(బి), కేస్లాపూర్ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పీరీలు,డోలలను గ్రామాల్లో ఊరేగిస్తూ.. యువకులు నృత్యం చేస్తున్నారు. మండలంలోని గొండ్‌గూడలో చిత్తకర్ర, గొండ్‌గూడ పీరీలు, డోలలు ఒక దగ్గర చేరడంతో సందడి వాతావరణం నెలకొంది.

పీరీల ఊరేగింపు
తాంసి: మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగ ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి. తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో డప్పుచప్పులతో పీరీలను ఉరేగిస్తున్నారు. తాంసి మండల కేంద్రంతో పాటు కరంజి(టి)లో పీరీలను బయటకు ఊరేగించారు. ప్రజలు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటున్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం
బోథ్: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని పీరీలను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు డప్పుల తో స్వాగతం పలికారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన జక్కుల వెంకటేశ్ సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజార్షి షాకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో పిచ్చి మొక్కలు పెరిగాయని వాటిని తీసివేయించాలని కోరారు. అలాగే రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలన్నారు. కాలనీలో రేషన్‌షాపు, శ్మశాన వాటిక నిర్మాణం, తదితర నిర్మానాలు చేపట్టాలన్నారు.

మరమ్మతులు చేయండి

బోథ్: మండల కేంద్రంలోని పెద్ద వాగుపై ఉన్న వంతెన చివరి భాగం కూలడానికి సిద్ధంగా ఉండటంతో రైతులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రైతులు వంతెనను పరిశీలించారు. వంతెన ఒక భాగం కూలితే తాము చేలల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని వాపోయారు. ఇక జీడిపల్లె మీదుగా సొనాలకు ప్రయాణికులు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. వంతెనకు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్, రైతులు చంద్రమోహన్ రెడ్డి, బాబు, రాములు, నిమ్మల నర్సయ్య, గంగయ్య, గంగాధర్, సింగం రమణ, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు వయా లక్సెటిపేట్, కరీంనగర్ మీదుగా హైదరాబాద్‌కు ఉదయం 6గంటలకు, 11:30 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని ఉట్నూర్ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళాశక్తి లబ్ధిదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాంసి: ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళ సంఘ సభ్యులను కోళ్లు, బర్రెల పెంపకం కోసం ఇది వరకే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఆయా గ్రామాల నుంచి ఎంపిక చేసిన లబ్ధిదారులకు సోమవారం మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ ఐకేపీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీసీ మహేందర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని పీఆర్టీయూ టీజీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. బదిలీ అయిన వారికి వారి పాత స్థానాన్ని చూపిస్తూ పాయింట్స్ కేటాయించాలన్నారు. మ్యుచువల్‌లో బదిలీ అయినా ఉపాధ్యాయులకు కూడా బదిలీల్లో అవకాశం కల్పించాలని తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులు ఉన్నతీకరించాలన్నారు. ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్, జాదవ్‌ప్రకాశ్, దినేశ్ బాబు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు



నార్నూర్: ఆషాఢమాసం గోరింటాకు వేడుకలను సోమవారం మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. గౌరిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తరతరాలుగా వస్తున్న సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుతూ మహిళలు గోరింటాకు వేడుకలు జరుపుకున్నారు. గోరింటాకు పెట్టుకోవడంతో ఆరోగ్యం, సౌభాగ్యం వస్తుందని మహిళలు నమ్ముతారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న జోగు రామన్న

జైనథ్: మండలంలోని కాపరి గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం స్థానిక నాయకులు గ్రామస్తులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి అభిషేకలు గావించి మొక్కుకున్నారు. పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, ఎల్టి వెంకటరెడ్డి, రాంరెడ్డి, పురుషోత్తం, తలకొక్కుల రామన్న, భట్టు ఊషన్న ఉన్నారు.